
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

మంగళవారం 6 ఫిబ్రవరి 2024



ఎమ్మెల్యే X ఇన్‌చార్జి

- కదిరి వైసీపీలో తారస్థాయికి విభేదాలు
- అధికారుల బదిలీల్లో ఇన్‌చార్జి మార్కు



ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ఇన్‌చార్జి మగ్బూల్



ఎమ్మెల్యే వర్గీయులే టార్గెట్

- ఎడాపెడా ట్రాన్స్‌ఫర్లు
- గుర్రుగా ప్రజాప్రతినిధి
- అధిష్టానంతో అమీతుమీకి సిద్ధం

కదిరి

వైసీపీ అధిష్టానం మార్పుచేర్పులతో కదిరి నియోజకవర్గంలో విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదని నియోజకవర్గ ఇన్‌చార్జిగా వైసీపీ అధిష్టానం ఇటీవల మగ్బూల్ బాషాను నియమించిన విషయం విదితమే. వచ్చీరాగానే ఇన్‌చార్జి మార్కు రాజకీయానికి తెరలేపారన్న చర్చ సాగుతోంది. అన్నీతానై వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏకంగా అధికారుల బదిలీలు సైతం చేయిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉన్నవారిని కదిరి నుంచి బదిలీపై పంపించేస్తున్నట్లు సమాచారం. తనకు అనుకూలమైన వారిని తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలతో సంబంధమేలేని శాఖల అధికారులను కూడా ఎమ్మెల్యేకి అనుకూలంగా ఉన్నారని ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నారట. ఎమ్మెల్యేగా ఉన్న తనకు మాట మాత్రమైనా చెప్పకుండా బదిలీలు చేయడం ఏంటని సిద్దారెడ్డి గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అధిష్టానాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నట్లు ఎమ్మెల్యే వర్గీయులు పేర్కొంటున్నారు. ఆ తరువాత కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే గతంలో తనకు అనుకూలమైన అధికారులను నియమించుకున్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇటీవల మగ్బూల్‌ను నియమించడంతో పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతమున్న అధికారుల్లో కొంతమందిని బదిలీ చేయించి, తాను కోరుకున్న వారిని తెచ్చుకుంటున్నట్లు సమాచారం. బదిలీల్లో ఇన్‌చార్జి మార్కు రాజకీయం చేసినట్లు తెలుస్తోంది. ఒక సామాజికవర్గానికి చెందిన అధికారులను బదిలీ చేయించినట్లు చర్చ సాగుతోంది. ఇన్‌చార్జి తీరుపై ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఇన్‌చార్జి, ఎమ్మెల్యే మధ్య విబేధాలు తారస్థాయికి చేరుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎమ్మెల్యే కూడా అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమైనట్లు సమాచారం. మొత్తమ్మీద వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే మధ్య అధికారులు బలవుతున్నట్లు తెలిసింది.

అమీతుమీకి సిద్ధం

తాను అధికారంలో ఉండగానే తనకు తెలియకుండా నియోజకవర్గంలో అధికారుల బదిలీలు చేపట్టడం ఎమ్మెల్యే సిద్దారెడ్డికి ఆగ్రహం తెప్పించినట్లు సమాచారం. దీనిపై అధిష్టానంతో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జి ఇష్టారాజ్యంగా బదిలీలు చేయించారని ఎమ్మెల్యే ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఇటీవలే పట్టణ సీఐగా బదిలీపై వచ్చిన పుల్లయ్య.. తనను కాదని, ఇన్‌చార్జి మగ్బుల్‌బాషాను కలవడంపై ఎమ్మెల్యే మండిపడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అమరావతిలోనే అధిష్టానాన్ని ప్రశ్నించడంతోపాటు, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడానికి సిద్ధమైనట్లు సమాచారం.

బదిలీల్లో మగ్బూల్ మార్కు

ఇటీవల అధికారుల బదిలీల్లో ఇన్‌చార్జి మార్కు రాజకీయం సాగుతోందని ఎమ్మెల్యే వర్గీయులు మండిపడుతున్నారు. అధికారులు వచ్చి పట్టుమని ఆరునెలలు కూడా కాకుండానే బదిలీ చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. పట్టణ సీఐగా నారాయణ రెడ్డి మూడు నెలల క్రితం బదిలీపై వచ్చారు. ఆయనను ఇటీవల అనంతపురం ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. కదిరిలో సీఐగా పనిచేస్తున్నపుడు వైసీపీ ప్రస్తుత ఇన్‌చార్జి మగ్బూల్ బాషాపై ఓ వివాదంలో కేసు నమోదు చేశారు. దీనిని మనసులో పెట్టుకుని ఇన్‌చార్జిగా నియమితుడవగానే మగ్బూల్.. మంత్రి పెద్దిరెడ్డి సాయంతో సీఐని బదిలీ చేయించినట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికలతో ఏమాత్రం సబంధంలేని విభాగంలో పనిచేస్తున్న అధికారులను సైతం బదిలీ చేయించినట్లు తెలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన విభాగంలో టీఎంసీగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని ధర్మవరానికి బదిలీపై పంపారు. ఆ విభాగానికి ఎన్నికలకు ఎటువంటి సంబంధం లేదు. ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉన్నాడన్న ఆరోపణలతో బదిలీ చేయించినట్లు సమాచారం. ఈ బదిలీ వెనుక కూడా ఇన్‌చార్జి ఉన్నట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు కదిరికి వచ్చి సరిగా ఒకటిన్నర సంవత్సరం అవుతోంది. ఆయనను కూడా ఇటీవల బదిలీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషా, కమిషనర్‌కు సయోధ్య కుదరలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేకి సన్నిహితంగా ఉన్నారన్న కారణంగానే కమిషనర్‌ను బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

తారస్థాయికి విభేదాలు...

వైసీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మగ్బూల్‌బాషాను నియమించినప్పట్నుంచి ఎమ్మెల్యేతో విభేదాలు తారస్థాయికి చేరుకున్నట్లు పట్టణంలో చర్చ సాగుంతోంది. మగ్బూల్ నియామకాన్ని ఎమ్మెల్యే వర్గీయులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామాలు సైతం చేశారు. ఎమ్మెల్యే ఇంటికి ఇన్‌చార్జి మగ్బుల్ వెళ్లినా.. ముబావంగానే ఉన్నట్లు ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే, ఇన్‌చార్జి మధ్య సయోధ్య కుదర్చడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కదిరికి వచ్చినపుడు కూడా ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం దుమారం రేపింది. ఆ తరువాత ఎమ్మెల్యే.. తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడిని కలిసి వచ్చారు. ఆ సయమంలో కూడా తాను పార్టీకి వ్యతిరేకంగా పనిచేయబోనని చెప్పినట్లు తెలిసింది. అంతే తప్ప.. ఇన్‌చార్జికి సహకరిస్తానని చెప్పిన దాఖలాల్లేవని సమాచారం. ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులైన పూల శ్రీనివాసరెడ్డి, బత్తల హరిప్రసాద్ తదితరులతో కలిసి ఇన్‌చార్జి తిరుగుతుండడంతో వీరిద్దరి మధ్య విభేదాలు మరింత ముదిరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారుల బదిలీలు మరింత ఆజ్యం పోశాయి. ఎమ్మెల్యే వర్గీయులను ఇన్‌చార్జి టార్గెట్‌గా చేసుకున్నట్లు వైసీపీలో చర్చ సాగుతోంది. కుటాగుళ్లకు చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డికి చెందిన, ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ క్వారీల్లో గనుల శాఖాధికారుల తనిఖీలు, బదిలీలు అఘాతాన్ని మరింత పెంచినట్లు తెలుస్తోంది

ఇక.. ఊడిగమే..!

వైసీపీ ఇన్‌చార్జిని కలిసిన మున్సిపల్ కమిషనర్

సర్వత్రా విమర్శలు

అధికారి బదిలీపై వస్తే ఉన్నతాధికారినిగానీ, ప్రజాప్రతినిధినిగానీ కలవడం ఆనవాయితీ. కదిరి మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన కిరణ్‌కుమార్ మాత్ర వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బుల్ బాషాను సోమవారం కలిసి, అందరినీ ఆశ్చర్య పరిచారు. అంతేనా, శాలువా కప్పి సత్కరించారు కూడా. ఎన్నికల వేళ పారదర్శకంగా సేవలందించాలని బదిలీ చేస్తే.. వచ్చీరావడంతోనే వైసీపీ నాయకుడిని కలవడం ఏంటని పట్టణవాసులు మండిపడుతున్నారు. ఇక ప్రజలకు పారదర్శకంగా సేవలందించడం వట్టిమాటేననీ, అధికార పార్టీకి ఊడిగం చేయడమే మిగిలిందని మండిపడుతున్నాంనను. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ నాయకులు చెబుతున్నారు. వచ్చీరాగానే మున్సిపల్ కమిషనర్.. ఉద్యోగులపై జులుం ప్రదర్శిస్తున్నారు. తాను మూడేళ్లపాటు ఇక్కడే ఉంటాననీ, చెప్పింది చేయకపోతే కథ తేలుస్తానంటూ వార్నింగ్ ఇచ్చేశారట. దీంతో కిందిస్థాయి ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.



వైసీపీ ఇన్‌చార్జిని కలిసిన మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ (కుడి)

నిరీక్షించి.. నీరసించి..

- సదరం శిబిరంలో పడిగాపులు
- 12 గంటలైనా రాని అధికారులు
- ఇబ్బందులుపడ్డ దరఖాస్తుదారులు



వైద్యుడి కోసం వేచి ఉన్న దరఖాస్తుదారులు



గుంతకల్లు నుంచి వచ్చిన విద్యార్థి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 5: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సదరం శిబిరాన్ని పర్యవేక్షించే వైద్యుల నిర్లక్ష్యం మూలంగా దరఖాస్తుదారులు పడిగాపులు పడాల్సి వచ్చింది. ఆస్పత్రిలో వైకల్య ధృవీకరణ ప్రతం కోసం సదరం క్యాంపు నిర్వహిస్తారు. సోమవారం పలువురు దరఖాస్తుదారులు తరలి వచ్చారు. దివ్యాంగులు ఒక్కరే రాలేరు కాబట్టి తోడుగా ఒకరో.. ఇద్దరో వచ్చారు. సదరం క్యాంపు చూసే వైద్యుడు మధ్యాహ్నం 12 గంటలైనా రాలేదు. దీంతో వారు పడిగాపులు కాయాల్సి వచ్చింది. అసలే దివ్యాంగులు.. గంటల తరబడి వేచి ఉండాలంటే నరకం అనుభవించారు. దూరప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి తెల్లవారుజామునే ఇళ్ల నుంచి బయల్దేరి వచ్చారు. గుంతకల్లుకు చెందిన మధుకు చేతి వేళ్లులేవు. తల్లితో పాటు తెల్లవారుజామున 3 గంటలకే గుంతకల్లులో బయలుదేరి 9 గంటలకు హిందూపురం చేరుకున్నాడు. 12 గంటలదాకా వైద్యుడి కోసం వేచి ఉన్నాడు. ఇలా దరఖాస్తుదారులు ఇబ్బందులు పడ్డారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా..

సర్పంచ్‌కు పోలీసుల నోటీసు



సర్పంచ్ ముత్యాలప్ప నాయుడుకు నోటీసు అందజేస్తున్న పోలీసు సిబ్బంది

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల కోరుతూ సర్పంచ్‌లు తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి పోలీసులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి వెళ్లకూడదంటూ మండలంలోని ఉప్పునేసినపల్లి సర్పంచ్ ముత్యాలప్పనాయుడుకు సోమవారం రూరల్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. స్టేషన్ వద్దకు పిలిపించుకుని, నోటీసులు ఇచ్చి పంపారని ఆయన తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని నిధులు అడిగితే ఇలా నోటీసులతో అడ్డుకునే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. నోటీసులతో ఉద్యమాలను ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని సర్పంచ్ మండిపడ్డారు.

9లోగా ఎన్‌ఎంఎంఎస్ ఖాతా తెరవాలి

కొత్తచెరువు, ఫిబ్రవరి 5: ఎన్‌ఎంఎంఎస్ ఆన్‌లైన్ ఖాతాను విద్యార్థులు ఈనెల 9వతేదీలోగా తెరవాలని జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 158 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇంకా 53 మంది ఆన్‌లైన్ ఖాతా కోసం దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఆయా విద్యార్థులు వెంటనే పాఠశాలల హెచ్‌ఎంలతో కలిసి ఖాతా తెరవాలని ఆయన సూచించారు.



ఎక్స్‌కవేటర్ వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

పెద్దిరెడ్డి దందా ఆపాలి..

టీడీపీ నాయకుల ధ్వజం

ఇసుక తరలింపును అడ్డుకున్న వైనం

హిందూపురం, ఫిబ్రవరి 5: మండలంలోని అప్పలకుంట వద్ద పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సాగిస్తున్న దందా ఆపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే వైసీపీని, మంత్రిని తరిమికొడతారంటూ మండిపడ్డారు. ఇసుక తరలిస్తున్న ప్రాంతానికి వెళ్లి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెన్నానదిలో ఇసుక కొల్లగొట్టి వందల కోట్లు సంపాదిస్తున్నారనీ, ఇదంతా మంత్రి పెద్దిరెడ్డి దందా అన్నారు. ఇలాగే చేస్తే మంత్రిని, ఆ పార్టీని తరిమికొడతారని హెచ్చరించారు. పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా రాత్రింబవళ్లు ఇసుక తరలిస్తుంటే ఏం చేస్తున్నారని పోలీసులు ప్రశ్నించారు. కర్నాటకకు ఇసుక తరలిపోతోందని స్థానిక ప్రజలు.. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకపోవడం వెనుక అసలు కథ ఏంటన్నారు. వెంటనే ఇసుక దందా ఆపాలనీ, లేదంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను తరిమివేశారు. కొంతమంది వైసీపీ నాయకులు ఇసుక తరలించేచోట ఉండగా.. స్థానికులు రావడంతో పరారయ్యారు. దీంతో దారికి అడ్డంగా గుంతను తవ్వించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, రూరల్ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ పాల్గొన్నారు.

110 మొబైల్ ఫోన్ల రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 5: వేర్వేరుచోట్ల చోరీ అయిన 110 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. వాటిని సోమవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి.. బాధితులకు అందజేశారు. వీటి విలువ రూ.22 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 348 మొబైల్‌ఫోన్లను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్నా, చోరీ అయినా 6305800426 నంబరుకు ఫోన్ పూర్తి వివరాలను వాట్సాప్ చేయాలన్నారు. మొబైల్ రికవరీ అయిన వెంటనే పోలీసు సిబ్బంది అందజేస్తారని ఎస్పీ తెలియజేశారు. మొబైల్ ఫోన్ల రికవరీలో చొరవ చూపిన పోలీసు సిబ్బందిన ఆయన అభినందించారు.

ఎంఈఓ-2ల జిల్లా కార్యవర్గం ఎన్నిక

ధర్మవరం, ఫిబ్రవరి 5: ఎంఈఓ-2 సంఘం జిల్లా కార్యవర్గాన్ని స్థానిక ఎమ్మార్సీలో సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్ (పుట్టపర్తి), ప్రధాన కార్యదర్శిగా రవిచంద్రకుమార్ (గుడిబండ), గౌరవాధ్యక్షుడిగా గోపాల్ (గోరంట్ల), కోశాధికారిగా గోపాల్‌నాయక్ (ధర్మవరం), అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, అదనపు ప్రధానకార్యదర్శిగా సల్మాన్‌రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జయచంద్ర, సురేశ్‌బాబు, మహిళా ప్రతినిధులుగా ప్రసన్నలక్ష్మి, శ్రీదేవి, జాయింట్ సెక్రటరీగా మోహన్‌బాబు ఎన్నికయ్యారు.

ఎన్నికల వేళా.. వెతలే...

ఐదో తేదీ దాటినా సగం మందికి అందని వేతనం

పెన్షనర్ల కష్టాలు వర్ణనాతీతం



ధర్మవరం, ఫిబ్రవరి 5: ప్రభుత్వోద్యోగులకు ఎన్నికల వేళ కూడా వేతన వెతలు తప్పట్లేదు. ఐదో తేదీ దాటినా ఇంకా సగం మందికి జీతాలు జమ కాలేదని సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఈ నెలలో జీతాలకు జాప్యం ఉండదనీ, పరిస్థితులు మారుతాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. 5వ తేదీ దాటినా అనేక విభాగాల ఉద్యోగులకు ఎదురుచూపులు తప్పలేదు. తొలివిడతగా క్రితం నెల 24వతేదీ నాటికి వేతన బిల్లులు పెట్టుకున్న ఒకటి అరా.. బిల్లులకు మాత్రమే వేతనాలు వచ్చినట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగుల వేతన బిల్లులను డ్రాయింగ్ అధికారులు ప్రతినెలా 25వ తేదీ, ఆ తరువాత మాత్రమే ట్రెజరీ కార్యాలయాలకు పంపుతారు. అతి కొద్దిమంది మాత్రమే 25వతేదీలోపు పెట్టుకుంటారు. అలా పెట్టుకున్న ఒకట్రెండు విభాగాల ఉద్యోగులకు మాత్రమే వేతనాలు ఇచ్చి ప్రభుత్వం మిగిలిన వారికి పెండింగ్‌లో పెట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా మారింది. రెండేళ్ల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా వీరికి తోడయ్యారు. ప్రతినెలా 10వతేదీ దాటకుండా వీరికి పెన్షన్లు, వేతనాలు దక్కడంలేదు. ఆర్బీఐ వద్ద ప్రతి మంగళవారం జరిగే బాండ్ల వేలం, రుణ పరిమితిపైనే వీరి వేతనాలు ఆధారపడ్డాయన్నట్లుగా పరిస్థితి తయారైంది.

పోలీసు, సచివాలయ ఉద్యోగులకే..

జిల్లాలో అన్ని ప్రభుత్వ విభాగాలకు సంబంధించి దాదాపు 21వేల మంది దాకా అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సచివాలయ ఉద్యోగులు మరో 4300వేల మంది దాకా ఉన్నారు. పోలీసు, సచివాలయ, వైద్య, న్యాయశాఖల ఉద్యోగులకు మాత్రమే తొలివారం వేతనాలు అందుతున్నాయి. పోలీసు, సచివాలయ ఉద్యోగులే ప్రభుత్వ ప్రాధాన్యంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలు సహా అన్ని ప్రాధాన్య శాఖల ఉద్యోగులకు మాత్రం రెండో వారంలోనో, ఆ తరువాతో ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తోంది. ఈ వెతలు ఎప్పుడు తప్పుతాయోనని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వాపోతున్నారు.

బరితెగింపు

పెన్నాను లూటీ చేస్తున్న ఇసుక మాఫియా

- నిత్యం వంద టిప్పర్లు తరలింపు
- పగలు ఆంధ్ర, రాత్రి కర్ణాటకకు..
- పెద్దిరెడ్డి అనుచరులమంటూ హల్‌చల్
- సమన్వయకర్త కనుసన్నల్లో తంతు
- రీచ్‌కు అనుమతి లేదంటున్న అధికారులు
- ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో బిల్లులు



టిప్పర్‌కి ఇసుక నింపుతున్న ఎక్స్‌కవేటర్

హిందూపురం

ఇసుకను ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు. నిన్నటిదాకా జేపీ సంస్థ ముసుగులో అధికార పార్టీ నాయకులు పెన్నమ్మను కొల్లగొట్టగా.. ప్రస్తుతం ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో బరితెగిస్తూ పగలు ఆంధ్ర, రాత్రి కర్ణాటకకు తరలిస్తూ కోట్ల ఆదాయాన్ని జేబులో వేసుకుంటున్నారు. ఈ ఇసుక దోపిడీకి సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండ ఉండటంతో జిల్లా యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు తవ్వుతున్నారు, ఎంత తవ్వుతున్నారన్న లెక్కలేదు. అసలు జిల్లాలో కొత్త రీచ్‌కు అనుమతేలేదంటున్నా.. అధికార పార్టీ నాయకులు దర్జాగా ఇసుకను కొల్లగొడుతున్నారు. హిందూపురం మండలం అప్పలకుంట వద్ద పెన్నానదిలో వారం రోజులుగా ఎక్స్‌కవేటర్ ద్వారా నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు.

పెద్దిరెడ్డి అనుచరులం అంటూ..

పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ప్రాంతంలో కొంతమంది బయటి వ్యక్తులు మంత్రి పెద్దిరెడ్డి అనుచరులమంటూ హల్‌చల్ చేస్తున్నారు. స్థానిక అధికారులెవరైనా వెళ్తే పెద్దిరెడ్డి అనుచరులమంటూ చెప్పుకుంటున్నట్లు తెలిసింది. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డి సమీప బంధువులతోపాటు ఆ వర్గానికి చెందిన కొంతమంది యువకులు రీచ్‌వద్ద కాపలాగా ఉంటూ.. బిల్లులు రాస్తున్నట్లు టిప్పర్ల డ్రైవర్లు పేర్కొంటున్నారు. రోజూ రూ.30లక్షల నుంచి రూ.50లక్షలదాకా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

రీచ్‌కు అనుమతుల్లేవ్..

గతంలో పోచనపల్లి, బేవనహళ్లి సమీపంలో జేపీ సంస్థకు ఇసుక రీచ్‌లు అప్పగించారు. ప్రస్తుతం ఆ అనుమతులు రద్దు చేశారు. అప్పలకుంట వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని సంబంధిత శాఖాధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో కొత్త రీచ్‌కు అనుమతుల్లేవని చెబుతున్నారు. ఇక్కడేమో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బిల్లులు ఇవ్వడం కొసమెరుపు. ఇందులో విశేషం ఏమిటంటే స్థానిక పోలీసు అధికారులు.. ఇసుక తరలిస్తున్న వ్యక్తులకు అనుమతి ఉందని చెబుతుండగా.. గనుల శాఖాధికారులు మాత్రం ఇసుకరీచ్‌కు అనుమతి లేదని స్పష్టం చేస్తున్నారు. గతంలో జేపీ సంస్థ డంప్‌చేసి ఉండుంటే దానిని తరలించుకోవచ్చు తప్ప.. ఎట్టి పరిస్థితుల్లోనూ నది పరివాహక ప్రాంతంలో ఇసుకను తవ్వడానికి వీలులేదని చెబుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు సైతం అనుమతిలేకుండా ఇసుక తరలిస్తే కేసు కట్టవచ్చు. అయినా నియోజకవర్గంలో వైసీపీని మంత్రి పెద్దిరెడ్డి భుజాన వేసుకోవడంతో ఇక్కడంతా ఆయన పాలనే సాగుతోంది. దీంతో స్థానిక అధికారులు సైతం అడ్డుకోవడానికి వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం.



ఇసుక నింపుకోవడానికి క్యూలో ఉన్న టిప్పర్లు



ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో ఉన్న బిల్లు

నిబంధనలకు తూట్లు

పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించుకుపోతున్నా... లారీల్లో పరిమితికి మించి రవాణా చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇటీవల పుట్టపర్తి ప్రాంతానికి చెందిన ఓ ఇంటి యజమాని గ్రానైట్ బండలు తీసుకెళ్తున్నాడు. తరలిస్తున్న వాహనంలో కొంచెం అధికలోడ్ ఉందని కేసురాసి, రవాణా శాఖాధికారులకు అప్పగించారు. ఓ రైతు మినీ ఆటోలో అరటి పండ్లు పొలం నుంచి హిందూపురం తరలిస్తుండగా అరటిపళ్లు అమ్మితే ఎంత సొమ్ము వస్తుందో అంతకు మించి జరిమానాను పోలీసులు, రవాణా శాఖాధికారులు విధించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా టన్నులకొద్దీ అధిక బరువుతో ఇసుక తరలిస్తుంటే పోలీసులు, రవాణా శాఖాధికారులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో వారికే ఎరుక.

నిత్యం వంద టిప్పర్లు..

పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి రోజూ పగలు, రాత్రి తేడాలేకుండా వంద టిప్పర్ల ఇసుకను తరలిస్తున్నట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి తెలుస్తుంది. హిందూపురం ప్రాంతంలో టిప్పర్ రూ.20వేలదాకా ఉండగా.. కర్నాటకలోని బెంగళూరుకు తరలిస్తే రూ.50వేల నుంచి రూ.60వేలదాకా విక్రయించుకోవచ్చు. దీంతో వైసీపీ నాయకులు పక్కాప్లాన్‌తో సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. పగలు హిందూపురం ప్రాంతానికి తరలిస్తున్నట్లు కనిపించినా.. రాత్రిపూట సరిహద్దు దాటి కర్నాటకకు తోలుతున్నట్లు స్థానికులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లపై.. జీఎస్టీనా!


పొలంలో అమర్చిన డ్రిప్ పరికరాలు

- రైతులపై అదనపు భారం
- నిధుల లేమితో ముందుకురాని కంపెనీలు
- బిందు, తుంపర సేద్యంపై ప్రభుత్వం చిన్నచూపు

కొత్తచెరువు, ఫిబ్రవరి 5: కరువు రైతుపై వస్తు సేవా పన్ను(జీఎస్టీ) భారం మోపుతున్నారు. బిందు, తుంపర(డ్రిప్, స్ప్రింక్లర్) సేద్యం పరికరాల మంజూరు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ)కింద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. 2017 జూలై 1 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీఎస్టీ కారణంగా గందరగోళం నెలకొంది. జీఎస్టీ భారం నుంచి రైతులకు ఉపశమనం కల్పిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సూక్ష్మసేద్య పరికరాల విషయాన్ని పొందుపరచకపోవడంతో జీఎస్టీ భారం రైతులపై పడుతోంది. దీంతో రైతు చెల్లించాల్సిన డ్రిప్ పరికరాల రాయితీ (డీడీ)పై 18 శాతం జీఎస్టీ వల్ల అదనపు భారం పడుతోందని వాపోతున్నారు.

కరువు జిల్లాకు డ్రిప్ జీవనాడి

ఉమ్మడి అనంత జిల్లాలో వ్యవసాయం ప్రధాన జీవనాధారం. రైతులు వర్షాభావం కింద వేరుశనగ పంటను సాగుచేస్తారు. వర్షాభావ పరిస్థితుల్లో సాగు చేసిన పంటలు పండక, చేసిన అప్పులు కట్టలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాభావ పరిస్థితులు, కూలీల కొరత, పెరిగిన సాగు పెట్టుబడులు తదితర కారణాలతో బిందు, తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ పద్ధతి ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని టీడీపీ హయాంలో ప్రకటించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రం సాయంతో ఏపీఎంఐపీ కింద డ్రిప్ పథకానికి ప్రాధాన్యం ఇచ్చింది. సబ్సిడీపై రైతులకు విరివిగా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను అందజేసింది. దీంతో రైతులు ఉద్యాన పంటలైన దోస, కర్బూజ, కళింగర పంటలతో పాటు కూరగాయల పంటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ దేశంలోనే అగ్రగామిగా జిల్లాను నిలిపారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న బిందు, తుంపర సేద్యంపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూడటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీంతో రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టీడీపీ హయాంలో 48 హెక్టార్లలో..

2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో నిర్దేశిత లక్ష్యాలు సాధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 48 వేల హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలు అందాయి. దాదాపు 52 వేలమంది రైతులకు లబ్ధి చేకూరింది. నిబంధనల ప్రకారం సకాలంలో పరికరాలు సరఫరా చేస్తూ రైతుల పొలాల్లో సంబంధిత డ్రిప్ కంపెనీలు పరికరాలను అమర్చారు. దీంతో రైతులు అధికపంటలు సాగుచేస్తూ దిగుబడులు సాధించారు.

వైసీపీ పాలనలో నామమాత్రమే..

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిందు, తుంపర సేద్యం పథకానికి గ్రహణం పట్టిందని రైతులు వాపోతున్నారు. 2019-2020లో 7490 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలను రైతులకు అందించగా తరువాత 2020-21,2021-22లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కంపెనీలు పరికరాలు సరఫరా చేయలేమని చేతులెత్తేశాయి. దీంతో రెండేళ్లు పూర్తిగా ఆగిపోయింది. ఈ రెండేళ్లలో రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు కట్టినా పరికరాలు అందక నానా అగచాట్లు పడ్డారు. రైతుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు గత ఏడాది డ్రిప్ కంపెనీలకుప్రభుత్వం బకాయిలు విడుదల చేసింది. 2022-23లో 6674హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలను సరఫరాచేశాయి. 2023-24కు 7వేల హెక్టార్లకు పరికరాలను అందించాలని లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు. అయితే జిల్లాలోని డ్రిప్ కంపెనీలకు పాత బకాయిలు కోట్లలో చెల్లించాల్సి ఉంది. కంపెనీలు సకాలంలో పరికరాలు సరఫరా చేయలేమని చెబుతున్నాయి.

టీడీపీ హయాంలో 90 శాతం సబ్సిడీ

బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో టీడీపీ ప్రభుత్వం 90శాతంసబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందించింది. దరఖాస్తు చేసుకున్నదే తడువుగా అప్పట్లో అధికారులు వెంటనే పరికరాలు అందజేసి సాగుకు సులభతరం చేసేవారు. గత ప్రభుత్వంలో డ్రిప్పరికరాల సాయంతో వేలాదిఎకరాలలో పండ్లతోటలు, కూరగాయలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాం.

– సుబ్బరాయుడు, రైతు, కొత్తచెరువు

డ్రిప్ పరికరాలపై జీఎస్టీ భారం

ప్రస్తుతం ఏపీఎంఐపీ కింద రూ.2లక్షలు విలువ చేసే డ్రిప్ పరికరాలు అందిస్తున్నారు. దీని ప్రకారం లక్షకు రూ.18వేలు చొప్పున రూ.2లక్షలకు రూ.36వేలు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం భరిస్తున్న 5శాతం మినహాయించిన ఇంకా లక్షకు రూ.13వేలు చొప్పున రూ.2లక్షలకు చెల్లించాల్సి ఉంది. దీంతో డ్రిప్ పరికరాల పొందాలంటే జీఎస్టీ భారం పడుతోంది. రెండున్నర ఎకరాలకు కూరగాయల డ్రిప్‌కు దాదాపు రూ.45వేల నుంచి రూ.60వేల దాకా డీడీ కట్టాల్సి ఉంది. టీడీపీ హయాంలో రూ.20వేల నుంచి రూ.30వేలు చెల్లిస్తే డ్రిప్ పరికరాలు వచ్చేవి. ప్రస్తుతం జీఎస్టీ భారంగా మారింది.

– అశోక్, రైతు,కొత్తచెరువు

9న డీవార్మింగ్ డే

- పిల్లలకు మాత్రలు వేయించండి: కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు, జేసీ తదితరులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5: జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం సందర్భంగా పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం 9వ తేదీన డీవార్మింగ్ డేను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఇందుకు సంబంధించి పోస్టర్లను కలెక్టర్, జేసీ, వైద్యాధికారులు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలకు నులిపురుగుల నివారణకు మాత్రలు వేయించాలని సూచించారు. జిల్లాలో ఏడాది నుంచి 20 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండోజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 1194 ప్రాథమిక, 194 ప్రాథమికోన్నత, 358 ఉన్నత పాఠశాలలు, 26 జూనియర్‌కళాశాలలు, 2302 అంగన్‌వాడీ కేంద్రాలు, డిగ్రీ కళాశాలల్లో 5,64,324 మంది పిల్లలు ఉన్నారన్నారు. వీరందరికీ తప్పకుండా మాత్రలు పంపిణీ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈఓ వైభోమ్‌నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య భవిష్యత్తును పరిరక్షిద్దాం..

పుట్టపర్తి: పిల్లలు ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం నులిపురుగుల నివారణ కోసం సమష్టి కృషిచేద్దామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని 9న జరుపుతున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,74,171మంది పిల్లలున్నారని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా రామకృష్ణారెడ్డి బాధ్యతలు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)గా రామకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న డీఆర్‌ఓ గాయత్రీదేవిని డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కడప జిల్లా రాజంపేట ఆర్డీఓగా ఉన్న రామకృష్ణారెడ్డిని జిల్లాకు ప్రభుత్వం నియమించింది. ఆయన సోమవారం జిల్లాకొచ్చారు. తొలుత కలెక్టరు, జేసీలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తనచాంబర్‌లో డీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టారు.

నేటి నుంచి ఎద్దులపల్లి రైల్వేగేట్ మూసివేత

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 5: రైల్వే ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా లెవల్ క్రాసింగ్ గేట్ 143 కిలోమీటర్ నెంబర్ 243, 14-16, పామిడి కల్లూరు మధ్యలోని ఎద్దులపల్లి వద్ద ఉన్న గేట్‌ను నాలుగు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తేదీ వరకు గేట్ మూసివేస్తామన్నారు. మరమ్మతులు పూర్తి కాగానే 10న తెరుస్తామన్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

వైసీపీ కోసం.. వలంటీర్లు..!


తాడిపత్రి పట్టణంలో ఓటరు జాబితాను వెరిఫై చేస్తున్న వలంటీరు

తాడిపత్రి పట్టణంలో ఓటరు జాబితాను పట్టుకుని వలంటీర్లు వీధుల్లో తిరుగుతున్నారు. ఓటరు జాబితా పరిశీలనకు వలంటీర్లను వినియోగించవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఖాతరు చేయడం లేదు. పట్టణంలోని టైలర్స్ కాలనీ, పాతకోట, శాస్త్రి నగర్, కేవీ రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఓటరు లిస్టును వలంటీర్లు వెరిఫికేషన్ చేశారు. ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని, లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రావని బెదిరిస్తూ కనిపించారు. కొన్నిప్రాంతాల్లో వలంటీర్లతోపాటు బీఎల్‌ఓలు ఒక ఇంటివద్ద కూర్చొని చుట్టుపక్కల ఇళ్లవారి ఓటరు జాబితాను వెరిఫై చేశారు.

– తాడిపత్రి

పంజాగుట్ట సస్పెండెడ్ సీఐ అరెస్టు

గుంతకల్లు, ఫిబ్రవరి 5: హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ సస్పెండ్ అయిన సీఐ దుర్గారావును అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో తెలంగాణ పోలీసులు సోమవారం అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తరలించారు. పంజాగుట్ట స్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ వద్ద ఓ కారు బారికేడ్లను ఢీకొట్టింది. ఆ ప్రమాదానికి కారకుడైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సోహైల్‌పై కేసు నమోదు చేయకుండా, కేసును పక్కదారి పట్టించారన్న ఆరోపణపై సీఐ దుర్గారావును సస్పెండ్ చేశారు. గతేడాది డిసెంబరు 23న పోలీసు స్టేషన్ వద్ద ఉన్న బారికేడ్లను సోహైల్ కారుతో ఢీకొట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి తండ్రి షకీల్ పైరవీచేసి సోహైల్ స్థానంలో ఆసిఫ్ అనే వేరే వ్యక్తిని పోలీసులకు అప్పగించి, తన కుమారుడిని విడిపించుకుపోయాడని ఆరోపణలు ఉన్నాయి. సోహైల్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించకపోవడం, కేసును పక్కదారి పట్టించడం తదితర ఆరోపణలు ఎదుర్కొన్న దుర్గారావు, ఉన్నతాధికారుల విచారణ అనంతరం సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ తరువాత అజ్ఞాతంలో ఉంటూ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ఉన్న సీఐ దుర్గారావును అరెస్టు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. దుర్గారావును హైదరాబాద్ వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయానికి విచారణ నిమిత్తం తరలించారని తెలిసింది.

నూతన తహసీల్దార్లు వచ్చేశారు..

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5: ఇతర జిల్లాల నుంచి జిల్లాకు బదిలీ అయిన 39 మంది తహసీల్దార్లు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి కేటాయించిన మండలాలబదిలీ ఉత్తర్వులను తీసుకున్నారు.

'చలో అసెంబ్లీ' నిర్వహించి తీరుతాం: డేగల

అనంతపురం అర్బన్/శింగనమల ఫిబ్రవరి 5: అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. సర్పంచుల 16 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పలు రూపాల్లో ఉద్యమాలు చేశామని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో చలో అసెంబ్లీ కార్యక్రమానికి రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడితో పాటు పలు జిల్లాలోని సర్పంచుల సంఘం నాయకులను వైసీపీ ప్రభుత్వం ముందస్తుగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఎంతమందిని అక్రమ అరెస్టులు చేసినా చలో అసెంబ్లీని నిర్వహించి తీరుతామన్నారు.

మార్చి 3న కవి సమ్మేళనం

పెనుకొండ, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో నీటి సంక్షోభం, నీటి అవసరాలపై మార్చి 3న సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జల కవచంపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ హరి తెలిపారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో జలకవచానికి సంబంధించిన బ్రోచర్లను కోకన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కన్వీనర్ హరి, తెలుగు అధ్యాపకుడు రామన్న, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, కోగిర జయచంద్రారెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి బాధలు, ఆవేదనలు ప్రజలకు తెలియజేసేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవితలు, పాటలు, పద్యాలు వినిపించాలనుకునేవారు ఈనెల 25వ తేదీ లోపు 9491355000, 944508510 నెంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

10 నుంచి నీటి సరఫరా కార్మికుల సమ్మె

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5: శ్రీరాంరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ కార్మికులకు 4 నెలల బకాయి వేతనాలు, 15 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం డివిజన్‌లో 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు స్కీమ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని కళ్యాణదుర్గం డివిజన్‌లో పనిచేస్తున్న వాటర్ సప్లయ్ కార్మికులకు 4 నెలలుగా వేతనాలు చెల్లించడకపోవడంతో వారి కుటుంబాల జీవనం కష్టతరంగా మారిందన్నారు. ఇదే సమస్యపై గతేడాది డిసెంబరు నెలలో సమ్మె నోటీసు ఇచ్చి 20 రోజులు నిరసనలు తెలపగా జనవరి 30 నాటికి వేతనాలు, పీఎఫ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అయినా ఇంతవరకూ హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, వెంటనే బకాయి వేతనాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


గంగిరెడ్డి (ఫైల్)

నల్లమాడ, ఫిబ్రవరి 5: శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం నల్లశింగయ్యగారిపల్లికి చెందిన రైతు గంగిరెడ్డి (68) అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గంగిరెడ్డి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో వప్పుశనగ పంట సాగుచేస్తుండేవాడు. కొన్నేళ్లుగా దిగుబడులు రాక నష్టపోయి, అప్పులపాలయ్యాడు. రూ.3 లక్షల వరకు అప్పులున్నాయి. వాటిని తీర్చే మార్గంలేక గంగిరెడ్డి సోమవారం పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు నల్లమాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కదిరికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైతుకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

- స్థానికంగా కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు..
- కిలో రూ.15 నుంచి రూ.20 వరకు..
- అనంతలో కీలకంగా ఓ మిల్
- మూలాలను గుర్తించడంలో పోలీసులు విఫలం


పీడీఎస్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5: రేషన్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధాన్యపు డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యాపారంగా మారిపోయింది. కిలోల నుంచి టన్నుల వరకు పెద్ద మొత్తంలో విక్రయిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యం కిలో రూ.15 నుంచి రూ.20 వరకు డిమాండ్ ఉంది. కొన్ని ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో బియ్యం సరిగా పంపడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో చాలా మంది రేషన్ డీలర్ల నుంచే అక్రమార్కులకు బియ్యం అందుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సరిహద్దు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు బియ్యం సరఫరా అవుతోంది. అడపాదడపా విజిలెన్స్ పోలీసులు అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నప్పటికీ సరఫరా మాత్రం ఆగడం లేదు.

కిలో రూ.15 నుంచి రూ.20 వరకు...

చౌకధాన్యపు డిపోల నుంచి పేద ప్రజలకు అందే బియ్యం పక్కదారి పట్టడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల నుంచి బియ్యం సేకరిస్తుంటారు. గత ఏడాది డిసెంబరు నెలాఖరులో రాప్తాడు మండలం హంపాపురం సమీపంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. 630 సంచులతో ఉన్న 320 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈనెల 4న అనంతపురం నగరంలోని తపోవనం సర్కిల్‌లో ఓ వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు 42క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నలుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఒక్కో ప్రాంతంలో డిమాండ్‌ను బట్టి కేజీ బియ్యం రూ.15 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది ఈ బియ్యాన్ని ఎక్కువగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. మరికొంతమంది తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆయా రాష్ట్రాలలో రూ.25 నుంచి రూ.30లకుపైగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనంతపురం పంగల్‌రోడ్డులో కీలకంగా ఓ మిల్

అనంతపురం నగరంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పీడీఎస్ బియ్యం నేరుగా ఆ మిల్‌కే చేరుకుంటుంది. పదులు, వందల కేజీలు కాదు ఏకంగా వేలటన్నుల్లో బియ్యం చేరుకుంటోందని సమాచారం. నగర శివారులోని పంగల్‌రోడ్డులో ఓ మిల్ ఇందుకు ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడ ఆ బియ్యాన్ని పాలిష్ చేయించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తుంటారు. అక్కడ మంచి ధరకే విక్రయించి బాగానే సొమ్ము చేసుకుంటారని తెలుస్తోంది. ఈనెల మొదటివారంలో పెద్ద మొత్తంలో బియ్యం ఓ ప్రాంతం నుంచి ఆ రైస్‌మిల్ వద్దకు వెళ్తుండగా సెబ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మిల్‌పై గతంలో దాడులు జరిగాయి. కానీ నేటికీ అక్కడ ఈ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. చాలా సందర్భాల్లో రాత్రి సమయాల్లో పాలిష్ చేస్తుంటారని సమాచారం. ఆ మిల్ నుంచి జిల్లా సరిహద్దు దాటే వాహనాలు నేరుగా వెళ్తాయనే ప్రచారం ఉంది. ఆ స్థాయిలో పోలీసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ముడుపులు అందుతాయని సమాచారం. దీనికి తోడు ఈ అక్రమ వ్యాపారం బయటకు పొక్కకుండా ఉండేందుకు కొన్ని వర్గాలకు సైతం ఆమ్యామ్యాలు అందుతాయట. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు... ఆ మిల్ నిర్వాహకులకు ఆదాయం ఏస్థాయిలో వస్తోందో. నగరంలో ఆ మిల్‌తో పాటు మరో నలుగురైదుగురు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో కీలకంగా ఉన్నట్లు తెలిసింది.

మూలాలను గుర్తించడంలో విఫలం...

కొన్ని సంవత్సరాల నుంచి పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా, సంబంధిత వారు అరెస్టయినా అక్రమ రవాణా ఆగడం లేదు. దీనికి ప్రధాన కారణం అసలైన మూలాలను పట్టుకోలేకపోవడమేనని తెలుస్తోంది. ఇందులో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. విజిలెన్స్, సెబ్, పోలీసులు ఇన్ని విభాగాలు దృష్టి సారిస్తున్నా బియ్యం అక్రమ రవాణాను నియంత్రించలేకపోతున్నారు. ప్రతి మండల పరిధిలో ఇద్దరి నుంచి ఐదుగురి వరకు క్షేత్రస్థాయిలో పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం. వారి నుంచి పెద్ద మొత్తంలో ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే వారికి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఎవరెవరు బియ్యాన్ని సేకరించి, అమ్ముతుంటారో పోలీస్‌శాఖకు స్పష్టంగా తెలుసు. కానీ వారందరూ యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకోకపోవడానికి ముడుపులు అందుతుండటమే కారణమని తెలుస్తోంది. మరి ఆ పైసలు ముట్టకుండా పోలీసులు ఎప్పుడు నిఘా పెడతారో వేచి చూడాల్సిందే.

భూమి కోసం రైతు ఆత్మహత్యాయత్నం


రైతు మంజునాథ్

పుట్టపర్తి, ఫిబ్రవరి 5: నా భూమిని మరొకరికి కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు న్యాయం చేయలేదంటూ రైతు మంజునాథ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రామగిరి మండలం పుట్టపర్తి గ్రామానికి చెందిన రైతు కలెక్టరేట్‌కు చేరుకుని స్పందన హాల్‌లో డీఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందించారు. నా భూమిని అక్కడ పనిచేస్తున్న వీఆర్‌ఓ ముత్యాలప్ప మరొకరికి బోరువేసుకోవడానికి అనుమతి ఇచ్చాడని, తాను ఎంత అడ్డుకున్నా నీకు హక్కులేదంటూ బెదిరించారన్నారు. సర్వేనంబరు 101-2లో 4.35ఎకరాల భూమి తనకు వారసత్వంగా వచ్చిందని వివరించారు. సమస్య పరిష్కరించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని డీఆర్‌ఓ ముందు వాపోయాడు. ఏం బెదిరిస్తావా అంటూ డీఆర్‌ఓ ఆగ్రహించగా తన బ్యాగులోంచి డీజిల్ బాటిల్ తీసుకుని మీదపోసుకోబోయాడు. అక్కడున్న సిబ్బంది అడ్డుకున్నట్లు మీడియా ప్రతినిధులతో వాపోయాడు. ఈ తంతు చూస్తున్న కలెక్టర్ రైతును పిలిచి మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే సర్వేయర్‌ను పిలిచి పరిశీలించాలని ఆదేశించారు. డీజిల్ బాటిల్‌తో లోనికి వస్తే మీరేం చేస్తున్నారంటూ పోలీస్ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హత్య కుట్రను భగ్నం చేసిన పోలీసులు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 5: పట్టణ సమీపంలోని సాయిలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద సోమవారం నాగరాజు అనే వ్యక్తిని హత్యచేయాలనుకున్న కుట్రను పోలీసులు భగ్నం చేసినట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన గోపాలభాస్కర్‌కు ఉరవకొండకు చెందిన వివాహిత సౌభాగ్యతో మూడేళ్లక్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఇరువురు చనువుగా ఉండేవారన్నారు. కొన్ని కారణాలతో భర్త నాగరాజుతో పాటు ముగ్గురు పిల్లలతో కలిసి సౌభాగ్య తాడిపత్రిలో కాపురం పెట్టిందన్నారు. దీంతో సౌభాగ్య, గోపాలభాస్కర్ మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడిందన్నారు. విషయం తెలుసుకున్న భర్త నాగరాజు భార్యతో తరచూ గొడవపడుతుండేవాడని తెలిపారు. అంతేకాకుండా గోపాలభాస్కర్‌తో కూడా గొడవపడేవాడన్నారు. ఎలాగైనా నాగరాజు అడ్డును తొలగించుకోవాలని భావించిన గోపాలభాస్కర్ కిరాయి మాట్లాడాడు. ఇందుకు అందరూ ససేమిరా అనడంతో చివరికి తానే నాగరాజును అంతమొందించాలని పథకం వేశాడన్నారు. పథకం ప్రకారం నాగరాజు కదలికలను గమనించిన గోపాలభాస్కర్ పట్టణ సమీపంలో ఉన్న సాయిలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద అతనిని హతమార్చాలని వేటకొడవలితో దాడిచేసేందుకు ప్రయత్నించగా అందిన సమాచారం మేరకు సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి అడ్డుకొని నిందితుడిని అరెస్టుచేశారని డీఎస్పీ తెలిపారు. సీఐతోపాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

'స్పందన' సమస్యల్ని త్వరగా పరిష్కరించాలి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

పుట్టపర్తి, ఫిబ్రవరి 5 : స్పందనలో ప్రజలు వినతుల ద్వారా తెలిపిన సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌కుమార్ ఆయా అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం స్పందన నిర్వహించగా.. 278 వినతులు అందాయి . జిల్లావ్యాప్తంగా ప్రజలు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ వినతిపత్రాలను అందజేశారు. కలెక్టర్ వాటిని స్వీకరించి సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కులగణన సర్వేపై సమీక్ష నిర్వహించారు. సర్వే ఇప్పటి వరకుకు 90శాతం వరకు జరిగిందని, ఇంకా మిగిలిన పదిశాతాన్ని పూర్తిచేయాలని అన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, మునిసిపల్ కమిషనర్‌లు ప్రత్యేకంగా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. ఈనెల 9వతేదీలోపు పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక వసతులపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 37 వినతులు

పుట్టపర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 37 వినతిపత్రాలు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యలకు పరిష్కారం కోరుతూ వాటిని అందజేశారు. ఎస్పీ మాధవ రెడ్డి వాటిని స్వీకరించి పరిశీలించారు. అలాగే వారి సమస్యల్ని సావధానంగా విన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు వినతుల ద్వారా తెలియజేసిన సమస్యల్ని మొదటి ప్రాధాన్యతగా భావించి త్వరగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వృద్ధులు, వికలాంగుల పట్ల సహృదయంతో వ్యవహరించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లాకేంద్రానికి రాలేని వృద్ధులు, వికలాంగులు, మహిళలు వారి వారి పరిధిలోని స్థానిక పోలీసు స్టేషన్‌లలో కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎస్పీకి అందిన సమస్యల్లో అధికంగా భూసమస్యలు, రస్తావివాదాలు, కుటుంబకలహాలు, అదనపు కట్నం కోసం వేధింపులు, ఉద్యోగమోసాలు, ఆర్థికమోసాలు, సైబర్‌నేరాలు ఉన్నాయి కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వినతిపత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు


జిల్లాపోలీసు కార్యాలయంలో ఎస్పీ..


టీడీపీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

20 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

ముదిగుబ్బ, ఫిబ్రవరి 5: మండలంలోని గాండ్లవారిపల్లికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశంలోకి చేరారు. అనంతపురంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ నివాసంలో, ఆయన సమక్షంలో ఆదివారం వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శ్రీరామ్ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి మాట్లాడారు. వచ్చే ఎన్నిల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీలోకి చేరిన వారిలో చింతప్ప, రోశన్న, నాగరాజు, నరసింహులు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకులు సూర్యశేఖరరాజు, ఆనంద్, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 5: ధర్మవరం ఆర్డీఓగా వెంకటశివరామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా.. గుంటూరు జిల్లా డ్వామా పీడీగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటశివరామిరెడ్డిని ధర్మవరం ఆర్డీఓగా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డివిజన్ తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటశివరామిరెడ్డి

నూతన ఆర్డీఓను కలిసిన బీజేపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 5: ధర్మవరం రెవెన్యూ డివిజన్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వెంకటశివారెడ్డిని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో సోమవారం వారు నూతన ఆర్డీఓను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఓటరు జాబితా అవకతవకల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షుడు డిష్‌రాజు, చిగిచెర్ల అరవింద రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రాప్తాటి రాము, దుస్సాకృష్ణ, బత్తలపల్లి మండల కన్వీనర్ వీరనారప్ప, మైనార్టీ నాయకులు నబీ రసూల్, పోరాళ్ల రహీం, నాయకులు బోడగల గిరిధర్, గంధమనేని నారాయణస్వామి, బొల్లినేని నారాయణస్వామి ఉన్నారు.


ఆర్డీఓను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

డీటీఎఫ్ రజతోత్సవ పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఓబుళదేవరచెరు వు, ఫిబ్రవరి 5: మండలంలోని కొండకమర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం డెమొక్రెటిక్ టీచర్స్ ఫెడరేషన్ రజతోత్సవ వాల్ పోస్టర్లను ఆ ఫెడరేషన్ నాయకులు సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, సోముశేఖర్‌నాయక్ మాట్లాడుతూ.. ఈనెల 10, 11వ తేదీల్లో విశాఖపట్నంలో రజతోత్సవాలు జరగనున్నాయని, జయప్రదం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల వేతన బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్లతో ఈ కార్యక్రమం జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ నాయక్, సబీనా, హతావుల్లా, నాగరాజు, మాధవి, భార్గవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి5: తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం పట్టణంలోని ఆశా వర్కర్లు తహసీలార్ సునితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమకు కనీస వేతనం రూ26వేలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్, సంక్షేమపథకాలు అమలు చేయాలన్నారు. అలాగే రాజకీయ వేధింపులు ఆపాలని, సంక్షేమపథకాలు వర్తింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు ఎ వేదవతి, అనిత, జ్యోతి, రమ్య, మహాలక్ష్మి, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలంటూ ధర్నా

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 5: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు మండల వ్యాప్తంగా వందలాదిమంది ఉన్నారన్నారన్నారు. కాగా వీరిలో చాలామంది సొంత ఇల్లులు లేక అద్దె ఇళ్లల్లో నివాసాలుంటున్నారని తెలిపారు. కావున భవన కార్మికులకు స్థలాలతోపాటు, పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. వెంకటాపురం పంచాయతీలో సర్వేనెంబర్ 11లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జాకీర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చలపతి, భవన నిర్మాణ కార్మికులు తిరుపాల్‌నాయక్, రమణ, గంగరాజు, కదిరప్ప, గంగులప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శనతో వినూత్న నిరసన..

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 5: తమసమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలో భవన కార్మికులు సోమవారం దీక్షా శిబిరంలో అర్ధనగ్న ప్రదర్శనతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంటిపట్టాలు మంజూరు చేయడంతోపాటు పలు సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ గత ఏడురోజులుగా రిలే దీక్ష చేస్తున్నామన్నారు. అయినా ఇంతవరకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించలేదని వాపోయారు. అందుకు నిరసనగా తాము అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్నట్లు చెప్పారు. వీరికి సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, కుళ్లాయప్ప మద్దతు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక అధ్యక్ష, కార్యదర్శులు కేశప్ప, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.


అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకుల పిలుపు

ధర్మవరం, ఫిబ్రవరి 5: అవినీతి వైసీపీ పాలనకు ఇక చరమగీతం పాడదామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 40వ వార్డులో గల గుట్టకిందపల్లిలో సోమవారం వారు టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ అధికారం చేపట్టి ఐదేళ్లు గడుస్తున్నా.. ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గుంతలు పడ్డ రోడ్లను కూడా బాగు చేసే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ పాలనకు చరమగీతం పాడి.. టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లిషరీఫ్, అశోక్, మాధవరెడ్డి, గోసలశ్రీరాములు, కరెంటు ఆది, జిలకరశీన, మారుతీస్వామి, కొత్తపేట ఆది, బడిగింజల రమణ, అత్తర్ రహీంబాషా, పల్లపు రవీంద్ర, బీరే శీన తదితరులు పాల్గొన్నారు.


గుట్టకిందపల్లిలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ శ్రేణులు

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్: జిల్లా వ్యాప్తంగా బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయా మండలకేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వారు బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పుట్టపర్తి తహసీల్దార్‌గా వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లా గోనెగండ్ల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ముదిగుబ్బ తహసీల్దార్‌గా సరస్వతి బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా కమలాపురం మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ధర్మవరం నూతన తహసీల్దార్‌గా ఎంఎ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా ఒంటిమిట్ట తహసీల్దార్‌గా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. బత్తలపల్లి నూతన తహసీల్దార్‌గా శివశంకర్‌నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లా గూడూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. నల్లమాడ తహసీల్దార్‌గా జీ. నాగభూషణం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. కొత్తచెరువు నూతన తహసీల్దార్‌గా కళావతి బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు.

మహిళ ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 5: మండలంలోని కొండమనాయనిపాళ్యంకు చెందిన రామకృష్ణమ్మ గత నెల 21వ తేదీన ఆత్మహత్య చేసుకుంది. భర్త, ఆడపడుచు వేధింపులు తాళలేక విషద్రావకం తాగి మృతి చెందింది. దీనిపై రూరల్ పోలీసులు మృతురాలి భర్త వేమనారాయణ, ఆడపడుచులు గంగాదేవి, మస్తానమ్మపై కేసు నమోదు చేశారు. ముగ్గురినీ కొండమనాయనిపాళ్యం వద్ద సోమవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేపు తనకల్లులో జయహో బీసీ

తనకల్లు, ఫిబ్రవరి 5: మండడలకేంద్రంలోని జీవన్ రెస్టారెట్ దగ్గరున్న ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ తొట్లిరెడ్డిశేఖరరెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సోంపాళ్యం నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ హాజరు కానున్నట్లు చెప్పారు. మండలంలోని బీసీలు, టీడీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

వృద్ధాశ్రమాల్లో దుస్తుల పంపిణీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 5: జిల్లాకేంద్రం సమీపంలోని కర్నాటకనాగేపల్లి రోడ్డు, ఎనుమలపల్లిలలో ఉన్న వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు జరిపిటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు వడ్డె సిమెంట్ పోలన్న, దళవాయి వెంకటనారాయణ దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ పీసీ గంగన్న, సంఘం ఉపాధ్యక్షుడు దండగల మారెప్ప, పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

తనకల్లు, ఫిబ్రవరి 5: మండలంలోని వివిధ గ్రామాలో జగనన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లలో అవతవలు జరుగుతున్నాయని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు పారేసు సోమవారం ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ జరపాలని కోరారు. మండలంలోని అన్నిగ్రామాల్లో జగనన్న లేఅవుట్ల లబ్ధిదారుల జాబితాను బహిరంగంగా ప్రకటించాలన్నారు.

ఓడీసీ ఎస్ఐగా వంశీకృష్ణ బాధ్యతలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 5: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముదిగుబ్బ ఎస్ఐగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కనగానిపల్లికి బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐకు పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నక్కలపల్లిలో ఘనంగా గంగమ్మ జాతర


గంగమ్మ జాతరలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 5: మండలంలోని నక్కలపల్లి గ్రామంలో సోమవారం గంగమ్మ జాతరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునే స్థానిక ఆలయంలోని అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. గ్రామస్థులు జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చారు. అనంతరం వాటిని సమర్పించి మొక్కులు చెల్లించారు. జంతుబలులు ఇచ్చారు. బంధుమిత్రుల రాకతో గ్రామం కిటకిటలాడింది. జాతర సందర్భంగా ఆటబొమ్మలు, గాజుల దుకాణాలు భారీగా వెలిశాయి. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ జాతర లో పాల్గొని అమ్మవారికి పూజలు చేయించారు.

బంద్‌ను విజయవంతం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్


మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

పెనుకొండ, ఫిబ్రవరి 5 : కార్మికుల సమస్యలపై వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టిన దేశా వ్యాప్త కార్మికుల సమ్మెను, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం వేమయ్యయా దవ్ అధ్యక్షతన నియోజకవర్గం సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంద్‌కు సంబంధించిన అజెండా వివరాలను తెలియజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలన్నారు. 2021లో విడుదల చేసిన ఐదు కనీస వేతనాల గెజిట్ అమలు చేయాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. నూతన విద్యావిధానం చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఇలాంటి పలు డిమాండ్లతో ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌ను విజయవం తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, మల్లికార్జున, వెంకటరాముడ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

● చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

తనకల్లు, ఫిబ్రవరి 5: మండలంలోని కోటపల్లి సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిచడం లేదని, సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉదయం ఆలస్యంగా రావడం, మధ్యాహ్నం 3గంటలు దాటిన తరువాత సచివాలయానికి తాళాలు వేసి వెళ్లిపోవడం పరిపాటిగా మారిందని చెబుతున్నారు. సోమవారం స్పందన ఉన్నప్పటికీ 4గంటలకే సచివాలయం మూసివేయడం ఏమిటని బీమ్లానాయక్ తండాకు చెందిన రమణనాయక్ ప్రశ్నించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ సమయ పాలన పాటించకుండా ఇష్టమొచ్చినప్పుడు వచ్చి వెళుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారని, వారి పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలా జరుగుతోందని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియక ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామస్థులు కోరారు.



సాయంత్రం 4గంటలకే తాళాలు పడిన కోటపల్లి సచివాలయం

నిబద్ధతగా పని చేయండి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 5: నిబద్ధతతో పని చేసి ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం ఏర్పడే విధంగా పోలీసులు సేవలందించాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతి, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి పలువురు సీఐలు, ఎస్ఐలు జిల్లాకు బదిలీపై వచ్చారు. సోమవారం వారు ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో హిందూపురం వన్‌టౌన్, మడకశిర అప్‌గ్రేడ్ సీఐలు ఈరన్న, మనోహర్, బుక్కపట్నం, అగళి ఎస్ఐలు సురేష్‌బాబు, వీరేష్ తదితరులు ఉన్నారు.

అల్ల నేరేడు చెట్లు దగ్ధం

కొత్తచెరువు, ఫిబ్రవరి 5: మండలంలోని బైరాపురం క్రాస్ సమీపంలోని అల్లనేరేడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితురాలు మంగళ జయలక్ష్మి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తనకున్న 3.30ఎకరాలలో అల్లనేరేడు చెట్లను సాగుచేశానన్నారు. అవి ప్రస్తుతం కాపునకు వచ్చాయన్నారు. అయితే సోమవారం సోమవారం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని కంచెకు నిప్పు పెట్టారని, మంటలు తోటకు వ్యాపించి మొత్తం చెట్లు కాలి బూడిదయ్యాయని వాపోయారు. దీంతో దాదాపు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందన్నారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు చివర్లో వచ్చి మంటలను ఆర్పివేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఇంటిపట్టాలు మంజూరు చేయాలని వినతి

నంబులపూలకుంట, ఫిబ్రవరి 5: నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి గృహాలు నిర్మించాలని మండలంలోని వంకమద్ది గ్రామానికి చెందిన నిరుపేదలు తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వారు ఆయన్ను కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో బోయ, ఎరికల, బెస్త కులాలకు చెందిన నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయన్నారు. తాతలకాలం నాటి నుంచి మూడుతరాలు వారు ఒకే ఇంటిలో జీవన సాగిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగిందని, అప్పటి ఇళ్లల్లో నివాసానికి కష్టంగా ఉందని వాపోయారు. కనుక తమకు ఇంటిపట్టాలు మంజూరు చేసి, గృహాలు నిర్మించాలని కోరారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారి పక్కన సర్వేనెంబర్ 143-6లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటిస్థలాలు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే శ్మశాన వాటికకు కూడా స్థలం మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రామచంద్ర, రమణ, పద్మావతి, విజయ్, క్రిష్ణయ్య, రెడ్డెప్ప, శ్రీరాములు, ఉత్తన్న, లోకేష్, మహేష్, అంజి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ధర్మవరం, ఫిబ్రవరి 5: మున్సిపాలిటీలో మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు తాగునీటి సరఫరా బంద్ చేయనున్నట్లు కమిషనర్ రాంకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బత్తలపల్లి మండలం తంబాపురం వాటర్‌వర్క్స్ నుంచి ఫిల్ట్రేషన్ ప్లాంట్ పైపులైన్ సుబ్బారావు పేట వద్ద లీకేజీ అవుతోందన్నారు. ఈ పైపులైన్‌కు మరమ్మతులు చేయనున్న కారణంగా మంగళవారం సాయంత్రం వరకు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తనకల్లు, ఫిబ్రవరి 5: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటలకు విద్యుత్ ఉండదన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

11న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, ఫిబ్రవరి 5: పట్టణంలోని ప్రభుత్వ ఉన్న తపాఠశాల ఆవరణలో ఈనెల 11వ తేదీన బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా సోమవారం తెలిపారు. ఈ మేరకు స్థానిక సాంస్కృతిక మండలిలో శిబిరానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీడీఓగా మహమ్మద్ దౌలా

నల్లమాడ, ఫిబ్రవరి 5: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నూతన ఎంపీడీఓగా ఎండీ మహమ్మద్‌దౌలా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లానుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కదిరి అర్బన్, ఫిబ్రవరి 5: మండలంలోని కుమ్మవాండ్లపల్లికి చెందిన ఖాదర్‌బాషా కనిపించడం లేదని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు అందింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. వివరాలిలా ఉన్నాయి. ఖాదర్‌బాషా ఐషర్ వాహన డ్రైవర్‌గా జీవనం సాగించేవారు. కాగా ఈనెల 1వ తేదీన తెల్లవారు జామున ఇంటినుంచి బయటకెళ్లిన ఆయన తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదని, దీంతో ఆయన భార్య గులాబున్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

గుడిబండ, ఫిబ్రవరి 5: మండలంలోని పీసీగిరి కొండలో వెలసిన ఈశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివ, పార్వతుల విగ్రహాలను ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మడకశిర సీఐగా మనోహర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ మనోహర్

మడకశిర టౌన్, ఫిబ్రవరి 5: మడకశిర పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో అప్‌గ్రేడ్ సీఐగా మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మడకశిర సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా విధులు నిర్వహిస్తామని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. మట్కా, పేకాట, మద్యం అక్రమరవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితు ల్లోనూ రాజీ ప్రసక్తే లేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి ఎస్ఐ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కియ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రంగడు...

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 5 : కియ ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రంగడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కియ ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు నల్లమాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లాలోని డీ హిరేహాళ్ మండలంలో పనిచేస్తున్న రంగడు ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కియా ఇండస్ట్రియల్ పరిసర గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచి గట్టి భద్రత చర్యలు చేపడతామన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతలు..


బాధ్యతలు చేపడుతున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

హిందూపురం, ఫిబ్రవరి 5 : స్థానిక మునిసిపల్ కమిషనర్ కే శ్రీకాంత్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ ప్రమోద్ కుమార్ బదిలీపై వెళ్లగా గుడివాడలో పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని హిందూపురం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని, పట్టణ ప్రజలు కూడా సహకరించాలన్నారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పలువురు తహసీల్దార్లు..

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తు తరుణంలో జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు ఇతర జిల్లాలకు వెళ్లారు. అలాగే ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు పలువురు తమక కేటాయించిన స్థానాల్లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇందులో భాగంగా పెనకొండ మండలం నూతన తహసీల్దార్‌గా ఉదయ్‌శంకర్‌రాజు బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం నుంచి మడకశిరకు బదిలీ అయ్యారు. అదేవిధంగా చిలమత్తూరు తహసీల్దారుగా భాగ్యలత, లేపాక్షికి బాల నరసింహులు, గోరంట్లకు జీ అక్బర్‌బాషా, రొద్దం మండల తహసీల్దారుగా లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. గుడిబండ మండల తహసీల్దారుగా ప్రతాప్‌రెడ్డి, అమరాపురానికి వెంకటసుబ్బయ్య, రొళ్ల మండల తహసీల్దార్‌గా ఎస్ భద్రుజమ బాధ్యతలు స్వీరించారు. వారికి ఆయా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. విధులకు సబంధించి ఏ చిన్నవిషయమైన తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని సిబ్బందికి సూచించారు. ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేయడానికి సహకరించాలని కోరారు.

'బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన అవసరం'

హిందూపురం, ఫిబ్రవరి 5: అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పారిశ్రామికవాడలోని ఇండియన్ డిజైన్ ఎక్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్‌లో మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన ఏఆర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల్లో ఎక్కువగా వస్తున్న బ్రెస్ట్ క్యాన్సర్‌పై పలు విషయాలను మహిళలకు తెలియజేశారు. ప్రధానంగా బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే మునుపు మహిళల్లో కలిగే మార్పులు, వచ్చిన తరువాత దానిని గుర్తించే విధానం, అనంతరం తీసుకోవాల్సిన చికిత్సలు వంటి విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 200 మంది మహిళా కార్మికులకు బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు యాస్మిన్, ఏజీఎం మహేష్, సుజాత, గైనకాలజిస్టు డాక్టర్ నందిత, డెర్మటాలజిస్టు డాక్టర్ సంధ్యరాణి, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 5: నగర పంచాయతీ పరిధిలోని మంగాపురంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా విద్యార్థులు శుభ్రతా పనులు చేపట్టినట్లు పీఓలు హాఫీజ్, శంకర్‌నాయక్ పేర్కొన్నారు. మూడోరోజు మంగాపురం నుంచి కోనాపురం వరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉండే కంపచెట్లు, వాటర్‌ట్యాంక్‌వద్ద శుభ్రతా పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, అధ్యాపకులు నరసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మాటతప్పి.. మడమ తిప్పిన జగన్

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత


సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 5 : మాట తప్పను, మడమ తిప్పను అన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు మెగా డీఎస్సీ విడుదల చేసి నేడు మాటతప్పి, మడమతప్పిన సీఎం అయ్యాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఎద్దేవ చేశారు. ఆమె సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ చేసిన అభివృద్ధి ఏమూలానా కనబడదని, ఈ ప్రభుత్వం ప్రజల కష్టాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. ఉద్యోగాలులేక విద్యావంతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులతో ప్రకటించిన డీఎస్సీని ఇప్పటికే దగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులు రోడ్డుపైకి వచ్చారన్నారు. ఈ ప్రభుత్వం అసెంబ్లీలో చివర గా ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ఇది. అంటే ఈ ప్రభుత్వం కాలపరిమితి త్వరలో అయిపోతోంది. అయితే ఈ నాలుగున్నరేళ్ల కాలంలో కనీసం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఏ మాత్రం దృష్టి పెట్టని దద్దమ్మ ముఖ్యమంత్రి అన్నారు. రాయలసీమలో నిరుద్యోగ యువతను ఆదుకోలేదని, పరిశ్రమల ఏర్పాటుకు, వ్యవసాయరంగానికి సబ్సిడీ ఇవ్వలేని రాయలసీమ ద్రోహి అన్నారు. 2019ఎన్నికల్లో గెలుపుకోసం ఇష్టారాజ్యంగా హామీలి చ్చి ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి, ఆ తరువాత అన్ని వర్గాల వారినీ మోసం చేయడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. అలాగే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామని అప్పుడు ప్రగల్భాలు పలికిన ఈ సీఎం గెలవగానే రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టు పెట్టినందుకు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తొలగాలన్నా, రాష్ట్రంలో మార్పులు తీసుకురావాలన్నా మళ్లీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వస్తేనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. ఇది దగా డీఎస్సీ

ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన



కార్యాలయం అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 5: ప్రభుత్వం కేవలం 6100 పోస్టులతో ప్రకటించినది మెగా డీఎస్సీ కాదని, నిరుద్యోగుల పాలిట దగా డీఎస్సీ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ... 23 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేస్తామని గత ఎన్నికలకు మునుపు ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని, పదవీ కాలం ముగుస్తుండగా ఇప్పుడు 6100 పోస్టులతో డీఎస్సీ విడుద ల చేస్తామని చెప్పడం సరికాదన్నారు. జూన్ నాటికి మరి కొంత మంది ఉపాధ్యాయులు రిటైర్ అవుతున్నారని, ఖాళీ అవుతున్న పోస్టులు కూడా కలుపుకొని నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్తగా రెండేళ్ల అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ఆ విధానం ఇంతకు మునుపే తొలగించారన్నారు. ఈ ఐదు సంవత్సరాల నుంచి దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగ యువత డీఎస్సీ నోటిఫికేషన్‌ల కోస ఎదురు చూస్తున్నారన్నారు. తీరా నోటిఫికేష్ విడుదల చేసే సమయానికి ఎన్నికలు వస్తాయన్నారు. మరి ఎప్పుడు డీఎస్సీ ప్రకటిస్తారో, ఎప్పుడు పరీక్షలు పెడతారో, వాటి ఫలితాలు ఎప్పుడు విడుదల చేస్తారో, ఎప్పుడు నియమాకాలు చేపడతాలో అంతా అయోమయంగా ఉందన్నారు. ఇది ఒక ఎన్నికల మాయ అని ఎద్దేవా చేశారు. అనంతరం ఎన్నికల విభాగం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, తాలుకా నాయకులు దేవరాజ్, వేణుగోపాల్, వరుణ్, పవన్, కార్తీక్, గోపి, బాలాజీ, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక బంద్‌ను విజయవంతం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్


మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

పెనుకొండ, ఫిబ్రవరి 5 : కార్మికుల సమస్యలపై వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టిన దేశా వ్యాప్త కార్మికుల సమ్మెను, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం వేమయ్యయాదవ్ అధ్యక్షతన నియోజకవర్గం సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంద్‌కు సంబంధించిన అజెండా వివరాలను తెలియజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని డిమాడ్‌చేశారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలన్నారు. 2021లో విడుదల చేసిన ఐదు కనీస వేతనాల గెజిట్ అమలు చేయాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. నూతన విద్యావిధానం చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఇలాంటి పలు డిమాండ్లతో ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివజిన్ కార్యదర్శి శ్రీరాములు, మల్లికార్జున, వెంకటరాముడు, నరసింహులు, జాఫర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయండి : ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 5: నిబద్ధతతో పని చేసి ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం ఏర్పడే విధంగా పోలీసులు సేవలందించాలని ఎస్పీ మాధవ రెడ్డి పోలీసు సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతి, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి పలువురు సీఐలు, ఎస్ఐలు జిల్లాకు బదిలీపై వచ్చారు. సోమవారం వారు ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో హిందూపురం వన్‌టౌన్, మడకశిర అప్‌గ్రేడ్ సీఐ లు ఈరన్న, మనోహర్, బుక్కపట్నం ఎస్సై సురేష్‌బాబు, అగిలిఎస్సై వీరేష్ తదితరులు ఉన్నారు.

అల్ల నేరేడు చెట్ల దగ్ధం

కొత్తచెరువు, ఫిబ్రవరి 5: మండలంలోని భైరాపురం క్రాస్ సమీపంలోని అల్లనేరేడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితురాలు మంగళ జయలక్ష్మి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తనకున్న 3.30ఎకరాలలో అల్లనేరేడు చెట్లను సాగుచేశానన్నారు. అవి ప్రస్తుతం కాపునకు వచ్చాయన్నారు. అయితే సోమవారం సోమవారం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని కంచెకు నిప్పు పెట్టారని, మంటలు తోటకు వ్యాపించి మొత్తం చెట్లు కాలి బూడిదయ్యాయని వాపోయారు. దీంతో దాదాపు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందన్నారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు చివర్లో వచ్చి మంటలను ఆర్పివేసినట్లు ఆమె పేర్కొన్నారు.

హాస్టల్ పరిశీలన

వసతులపై మానిటరింగ్ కమిటీ సభ్యుల అసంతృప్తి

పెనుకొండ, ఫిబ్రవరి 5 : పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని సోమవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు శంకరయ్య, బోయలత సందర్శించి మౌలిక వసతులపై ఆరాతీశారు. హాస్టల్‌లో మొత్తం 170మంది విద్యార్థినులు చదువుకుంటున్నారన్నారు. వసతి గృహం మొత్తం అసంతృప్తిగా ఉందని నీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రంగా ఉందన్నారు. అక్కడే వంటగది ఉండటం, చెడిపోయిన కూరగాయలతో వంట చేయడం, ఉడకని అన్నం, రుచిగాలేని నీళ్లచారు, పప్పు ఉందని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. చాలీచాలని తరగతి గదులు, సరైన రెస్ట్‌రూమ్, డైనింగ్‌హాల్‌లేవన్నారు, సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులు లేకపోవడంతో 10వ తరగతి విద్యార్థులే తమ సొంత డబ్బులతో ఉపాధ్యాయులను నియమించుకుని పాఠాలు బోధించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించ డంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మెనూ ప్రకారం ఇవ్వాల్సిన భోజనం ఇవ్వడం లేదన్నారు. వీటన్నింటిని మేము గమనించామన్నారు. కొత్త భవనం నిర్మిస్తే కొంతవరకు పరిష్కారం కావచ్చని భావించామన్నారు. వసతిగృహంలో విద్యార్థులు పడుతున్న కష్టాలను ఇబ్బందులను రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి, రాష్ట్ర గిరిజన కార్యదర్శి, జిల్లాకలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

మీడియాపై దాడులు సరికాదు

పాత్రికేయ సంఘం నాయకులు - సబ్‌కలెక్టర్, డీఎస్పీకి ఫిర్యాదు


సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్‌కు ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 5: మీడియాపై దాడులు చేస్తే... వారి పతనానికి అదే పునాది అవుతుందని పాత్రికేయ సంఘం నాయకులు పలువురు పేర్కొన్నారు. ఓ మీడియా ప్రతినిధిపై దౌర్జన్యానికి పాల్పడిని మంత్రి ఉషశ్రీ గన్‌మెన్‌పై సోమవారం సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, డీఎస్పీ బాజి జాన్ సైదులుకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, పాత్రికేయులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ... విధినిర్వహణలో భాగంగా మీడియా మిత్రులు ముఖ్యమైన ప్రతి సంఘటనను కవరేజ్ చేస్తారని అన్నారు. అలాగే సోమందేపల్లి మండలం చాలకూరులో గంటపాటు మంత్రి కాన్వాయి రహదారిపై ఉండటంతో ఆ సంఘటనను చిత్రీకరిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో మంత్రి ఉషశ్రీ తన గన్‌మన్లను ఉసిగొలిపి పలువురు మీడియా మిత్రుల నుంచి సెల్‌ఫోన్లు లాక్కుని వీడియోలు, ఫొటోలు డిలీట్‌చేసే ప్రయత్నాలు చేశారని అన్నారు. ఏ పార్టీకి చెందిన నాయకులైనా మీడియాపై దాడులు చేయకూడదని అన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా ప్రతినిధులు శివప్రసాద్, ఆదినారాయణ, ప్రకాశ్‌గౌడ్, ప్రసాద్, నరేష్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అరుణ్‌కుమార్, లక్ష్మీకాంత్, చంద్రమౌళి, కిరణ్, చంద్రశేఖర్‌రెడ్డి, హరి, చరణ్, మధుమోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సచివాలయాల నిర్వహణ



సకాలంలో తెరుచుకోని చందకచర్ల గ్రామ సచివాలయం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 5: గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం ప్రభు త్వం సచివాలయాల వ్యవస్థను ప్రారంభించినట్లు పాల కులు, అధికారులు చెబుతున్నారు. అయితే దాని అమలు లోపభూయిష్టంగా కనిపిస్తోంది. అందుకు మడకశిర నియోజకవర్గంలోని పలు సచివాలయాలే అందుకు నిదర్శనంగా కనిసిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారుల సరియైన పర్యవేక్షణ లేకపోవడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 70 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాలు పనిచేయాల్సి ఉంది. అయితే చాల సచివాలయాలు సకాలంలో తెరుచుకోవడం లేదు. తెరుచుకున్న సచివాలయాల్లో కూడా సిబ్బంది వచ్చి అటెండెన్స్ వేసి వెళ్తున్నారు. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే

ప్రజలకు తప్పని ఇబ్బందులు

ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మడకశిర మండలంలోని చందకచర్ల గ్రామ సచివాలయం తలుపులు సోమవారం ఉదయం 10.30 అయినా తెరుచు కోలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన చాలా మంది నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్యను వివరణ కోరగా... సచివాలయంలో పనిచేస్తున్న చాలా మంది సిబ్బంది బీఎల్‌ఓలుగా, కులగణన సర్వే కోసం గ్రామాలకు వెళ్లారని తెలిపారు. దీంతో సకాలంలో సచివాలయం తీయలేదని తెలిపారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్ల తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిలమత్తూరు, ఫిబ్రవరి 5: మండలంలో విద్యుత్ శాఖలో జరుగుతున్న అక్రమాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలో అక్రమ విద్యుత్ కనెక్షన్లపై, క్షేత్రస్థాయి లైన్‌మన్లు, కాంట్రాక్టర్ల అవినీతిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వెలువడిన 'కాసుల కరెంటు, తవ్వేకొద్దీ అక్రమాలు' అనే శీర్షికలతో వెలువడిన కథనాలకు విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు స్పందించారు. విజిలెన్స్ అధికారి లక్ష్మీకాంత్ మండలంలో పర్యటించారు. ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయి. ఎస్టిమేట్లు లేకుండా ఎక్కడ పనులు చేశారు? వంటి విషయాలను ఆయన స్వయంగా గ్రామాలకు వెళ్లి పరిశీలించారు. అక్రమాలు జరిగిన చోట స్థానికులతో మాట్లాడారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఎవరు ఇచ్చారు? కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారా? వంటి విషయాలపై ఆరా తీశారు. చాలా చోట్ల ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు నిర్వహించినట్లు ఆయన పరిశీలనలో తేలినట్లు సమాచారం. దీనిపై ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో చోటుచేసుకున్న అక్రమాలపై పత్రి కల్లో కథనాలు వచ్చాయని, వాటి ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో నిజానిజాలు పరిశీలించినట్లు తెలిపారు. జరిగిన అవకతవకలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

కోడ్ వచ్చేలోగా పంట నష్టపరిహారం అందించాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

మడకశిర, ఫిబ్రవరి 5: సార్వత్రిక ఎన్నికల కోడ్ విడుదలయ్యే లోగా 2023 ఖరీఫ్ పంటకు సంబంధించి పంట నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆయన సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత యేడాది జిల్లాలో వ్యవసాయరంగం కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని ఎదర్కొందని అన్నారు. రుతుపవనాలు విఫలం కావడంతో 40శాతం లోటు వర్షపాతం నమోదైందని, దీంతో జిల్లావ్యాప్తంగా 65శాతం భూమి బీడుగా ఉందన్నారు. ప్రధాన పంట వేరుశనగతో పాటు రాగి, మొక్కజొన్న, కంది, పత్తి, ఆముదం, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేసి ఎకరాకు రూ. 25వేలు దాకా రైతులు నష్టపోయా రని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రతియేటా ఏదో ఒక రూపంలో పంటలు నష్ట పోతున్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్క 2016 యేడాది లోనే ఖరీఫ్ లో నష్ట పోయిన ఉమ్మడి జిల్లా రైతులకు రూ. 1471 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా మంజూరు చేసిందన్నారు. సీజన్ ముగిసే లోగానే పరిహారం అందిస్తామని, 2024 సంక్రాంతి నాటికి రైతుల ఖాతాల్లోకి పరిహారం జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఎన్నికలకోడ్ వచ్చే లోగా మొత్తం పక్రియ ముగించి నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ డిమాండు చేస్తోందని ఆయన అన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ టీడీపీ అండ

మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న


ముద్దరంగప్ప కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఈరన్న

మడకశిర రూరల్, ఫిబ్రవరి 5 : కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న తెలిపారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ బుళ్ళసముద్రం గ్రామానికి చెందిన ముద్దరంగప్ప అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఈరన్న ఆ గ్రామానికి వెళ్లి ముద్దరంగప్ప భౌతిక కాయంపై పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా మణూరు పంచాయతీ సుంకరెడ్డిపల్లికి చెందిన మండల మాజీ కన్వీనర్ శంకర్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆ గ్రామానికెళ్లి శంకర్‌రెడ్డిని కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్యవిషయాలు అడిగి తెలుసుకొన్నారు. ఈరన్న వెంట మాజీ ఎంపీపీలు అశ్వత్థామప్ప, ఆదినారాయణ, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డీ.. నీ గతాన్ని గుర్తు చేసుకో..!

మంత్రికి కాంగ్రెస్ నాయకుల హితవు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 5: నీకు రాజకీయ అడుగులు పడింది ఏ పార్టీ నుంచి ఒక్క సారి గుర్తు చేసుకో అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హితవు పలికారు. వారు సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ శవం అని, దానిని ఓ నలుగురు వ్యక్తులు మోస్తున్నావని అన్నావని, మరి ఆ నలుగురిని చూసి ఎందుకు ఉలిక్కి పడుతున్నావని మంత్రిని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని ఎవరూ ఏమి చేయలేరన్నారు. 2019లో ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి గద్దె ఎక్కారన్నారు. మీ పదవీ కాలం పూర్తి అవుతున్నా రాష్ట్రానికి మీరు చేసిందేమీ లేదన్నారు. 22 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి పోలవరం సాధించుకుంటమని గత ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికి, ఇప్పుడు ప్రధాని మోదీ కాళ్ల దగ్గర దాసోహం అంటున్నారని ఎద్దేవ చేశారు. షర్మిల రాకతో వైసీపీలో వణుకు పుట్టిందని, ఎంతో మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. షర్మిలపై కక్ష కట్టి ఆమెకు సెక్యూరిటీ ఇవ్వడం లేదన్నారు. అవసరమైతే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు షర్మిలకు ప్రైవేట్ సైన్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ మనోమర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు అమానుల్లా, పట్టణాధ్యక్షుడు జమీల్, ఓబిసి జిల్లా అధ్యక్షుడు తిరుపాల్, నాయకులు మహబూబ్ బాష, రామాంజి, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన

రొద్దం, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఈవీఎంలను ప్రదర్శించి, కార్యాలయానికి వచ్చేవారికి ఓటు ఎలా వేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఏ గుర్తుకైనా, ఇష్టమొచ్చిన వారికి ఓటును వేసే విధానా న్ని వివరించారు.

భావితరాలకు స్ఫూర్తి వడ్డె ఓబన్న: బీజేపీ


వడ్డె ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 5: భవిష్యత్ తరాలకు వడ్డె ఓబన్న స్ఫూర్తిదాత అని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శ్రీకంఠపురం సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహానికి వారు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారి కబంధ హస్తాల నుంచి భారతీయులను విముక్తి కలిగించడానికి ఆయన చేసిన పోరాటాలు భావితరాలకు స్ఫూరిదాయకంగా నిలిచాయన్నారు. భరతమాత ముద్దు బిడ్డగా ఆయన చూపిన మార్గంలో అందరూ పయనించి దేశభక్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నగేష్, రాష్ట్ర నాయకుడు రమేష్‌రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ అంజలి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, కల్లుగీత సెల్ జిల్లా కన్వీనర్ శ్రీరాములు, నాయకులు మా రుతి, సునీల్, చక్రపాణిరెడ్డి, హరి ప్రసాద్‌రెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.